## ఒక్కసారి పెట్టుబడితో
### ఆయిల్‌పామ్ సాగుతో మస్తు లాభాలు
# 30 ఏండ్లు రాబడి



- రంగారెడ్డి జిల్లాలో విస్తరిస్తున్న ఆయిల్ పామ్ సాగు
- ఈ ఏడాది 5వేల ఎకరాల్లో సాగు చేయడమే లక్ష్యం
- ఇప్పటికే 75 ఎకరాల్లో సాగవుతున్న తోటలు
- మంజూరు దశలో మరో 250 ఎకరాలు..
- సబ్సిడీపై డ్రిప్.. ఉచితంగా మొక్కల పంపిణీ
- ఒక ఎకరంలో రైతు నికర ఆదాయం రూ.1.20లక్షలు
- వాల్యూ ఆయిల్ పామ్ కంపెనీకి పంట కొనుగోలు బాధ్యతలు

రంగారెడ్డి, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): 'ఆయిల్ పామ్ సాగుపై జిల్లా రైతాంగం ఆసక్తి చూపుతున్నది. సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి, లాభాలు తెచ్చే పంటలు పండించడంపై దృష్టి సారిస్తున్నారు. మూడేండ్లు శ్రమిస్తే 30 ఏండ్లపాటు ఆదాయాన్నిచ్చే ఆయిల్‌పామ్ సాగు వైపు ఉద్యానవన శాఖ సైతం రైతులను మళ్లిస్తున్నది. పెట్టుబడి తక్కువ.. రాబడి ఎక్కువగా ఉండడం.. ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు అందిస్తుండడంతో రైతులు ఉత్సాహం చూపుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాది 5వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును చేపట్టాలని ఉద్యానవన శాఖ లక్ష్యంగా పెట్టుకున్నది. ఇప్పటివరకు 75 ఎకరాల్లో తోటలు సాగవుతున్నాయి. మరో 250 ఎకరాల్లో సాగు మొదలుకానున్నది. ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి క్షేత్రస్థాయి సర్వే అనంతరం మంజూరు కల్పిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.'

**వాల్యూ ఆయిల్ కంపెనీకి బాధ్యతలు**

మారుతున్న పరిస్థితులు, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలను సాగు చేయాలని ప్రభుత్వం సంకల్పిస్తున్నది. ఈ తరుణంలో మార్కెట్‌లో పెరుగుతున్న ఆయిల్ ధరలతో పాటు వినియోగం పెరిగిన కారణంగా విదేశాల నుంచి ఇబ్బడిముబ్బడిగా జరుగుతున్న దిగుమతులను అరికట్టడానికి రైతులను ఆయిల్ పామ్ తోటల సాగు వైపు మళ్లిస్తున్నది. ఇందుకోసం మొక్కలను ఉచితంగా అందజేయడంతోపాటు రాయితీలు కూడా కల్పించి తోటల సాగుకు జిల్లా రైతాంగం ముందుకొచ్చేలా చైతన్యపరుస్తున్నది. 2023-24 సంవత్సరంలో రంగారెడ్డి జిల్లా పరిధిలో 5వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును చేపట్టాలని కార్యాచరణను రూపొందించింది. ఆయిల్ పామ్ విస్తరణ, నర్సరీల నిర్వహణ, గెలల ప్రాసెసింగ్ బాధ్యతలను వాల్యూ ఆయిల్ పామ్ కంపెనీ చూసుకోనున్నది. రైతులకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేయడంతోపాటు, పండించిన పంటలను సైతం ఈ సంస్థనే కొనుగోలు చేసి ప్రాసెసింగ్‌కు పంపనున్నది.

**ఎకరాకు రూ.1.20 లక్షల ఆదాయం!**

నీరు సమృద్ధిగా ఉన్న సారవంతమైన నేలలో ఆయిల్ పామ్స్ సాగు చేస్తే నాలుగేండ్ల నుంచి 30 ఏండ్ల వరకు నిరంతర ఆదాయం పొందవచ్చు. నాలుగేండ్ల తర్వాత దిగుబడులు మొదలవుతాయి. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ ఆయిల్ పామ్ కాయలకు టన్నుకు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు ధర ఉంది. ఈ లెక్కన ఖర్చులు పోనూ ఎకరాకు రూ.1.20లక్షల ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు. డ్రిప్ ద్వారా మొక్కలు ఎండిపోకుండా నీరు సమృద్ధిగా అందిస్తే దిగుబడులు మరింతగా వస్తాయంటున్నారు. మొదటి సంవత్సరం కొంత పెట్టుబడి కాగా.. రెండో సంవత్సరం నుంచి కాత వచ్చే వరకు పెద్దగా పెట్టుబడి అవసరం ఉండదు. మూడేండ్ల వరకు మొక్కల మధ్య మొక్క జొన్న, మిరప, పూలు, పెసలు, మినుములు, నువ్వులు, కూరగాయలను అంతరపంటగానూ సాగు చేసుకోవచ్చు. అకాల వర్షాలు, గాలి బీభత్సం వచ్చినా తోటలకు నష్టం ఉండదని, పశువులు, కోతులు కూడా పంటలను నష్టపర్చలేవని అధికారులు చెబుతున్నారు.

**రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం**

జిల్లా రైతులు ఆయిల్ పామ్ వైపు దృష్టిసారించాలి. ఈ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలు అందిస్తున్నది. ఈ పంట మన ప్రాంతానికి కొత్త అయినప్పటికీ.. ఇక్కడి వాతావరణం, భూములు అనుకూలంగా ఉన్నాయి. మొక్కలు నాటడం, సస్యరక్షణ చర్యలు, పంటల విక్రయాల వరకు ఉద్యాన శాఖ అండగా ఉంటుంది. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి ఎప్పటికప్పుడు మంజూరు ఇస్తున్నాం. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి.

**- నీరజ గాంధీ, ఇన్‌చార్జి జిల్లా ఉద్యావన శాఖ అధికారిణి, రంగారెడ్డి జిల్లా**

**రాయితీ ప్రోత్సాహకాలు**

ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నది. ఎకరాకు 50 నుంచి 57 మొక్కలు అవసరం ఉండగా ప్రస్తుతం వాటిని పూర్తి ఉచితంగా అందజేస్తున్నది. డ్రిప్ సిస్టమ్ కోసం బీసీలకు 90 శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ ఇస్తున్నది. పన్నెండున్నర ఎకరాల వరకు రైతులు ప్రభుత్వం నుంచి రాయితీలు పొందే అవకాశం ఉంది. పంట ఎదుగుదల కాలంలోనూ కొంత నగదును ప్రభుత్వం ప్రోత్సాహకంగా అందిస్తున్నది.

| కేటాయింపులు | ఎకరానికి రాయితీ(రూ.లలో) |
|---|---|
| మొక్కలకు (ఎకరానికి 50-57 మొక్కలు) | 11,600 |
| మొదటి ఏడాది ఎరువులు, అంతర పంటలకు | 4,200 |
| రెండో ఏడాది | 4,200 |
| మూడో ఏడాది | 4,200 |
| నాలుగో ఏడాది | 4,200 |
| బిందు సేద్యం | 22,518 |
| మొత్తం | 50,918 |



హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను బుధవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పరామర్శించారు. **- షాబాద్, డిసెంబర్ 13**



హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను బుధవారం పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పరామర్శించారు. **- పరిగి, డిసెంబర్ 13**



- తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను బుధవారం హైదరాబాద్‌లో వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజులారమేష్ దంపతులు, కౌన్సిలర్ గాయత్రి లక్ష్మణ్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. **- వికారాబాద్, డిసెంబర్ 13**
- రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా, శిశు, సంక్షేమ శాఖ మంత్రి అనసూయ (సీతక్క)ను బుధవారం సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కలిసి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. **- కడ్తాల్, డిసెంబర్ 13**

# క్రీడల్లో చేవెళ్ల పాఠశాలకు అవార్డుల పంట



క్రీడల్లో మంచి ప్రతిభ కనబర్చి అవార్డులు తెచ్చిన విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ శారద

మొయినాబాద్, డిసెంబర్ 13 : తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో చేవెళ్ల పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. చేవెళ్ల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఎస్.వైష్ణవి అండర్-14 అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచారు. 600 మీటర్లలో రెండో స్థానంలో నిలిచి రాష్ట్రంలో వ్యక్తిగతంగా ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నది. అండర్-17లో 9వ తరగతి చదువుతున్న పి.శ్రుతి 4 బై100 రిలేలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి గురుకుల విద్యా సంస్థ, చేవెళ్ల గురుకుల పాఠశాలకు మంచి పేరు తెచ్చిన విద్యార్థులను గురుకుల విద్యా సంస్థల హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పశ్చిమ ప్రాంతీయ సమన్వయ అధికారి డాక్టర్ శారదావెంకటేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ డి.రమాదేవి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

# పారదర్శకంగా వరి ధాన్యం కొనుగోళ్లు



బొంపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమను పరిశీలిస్తున్న జిల్లా అధికారి గోపాల్

దోమ, డిసెంబర్ 13 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోళ్లు జరగాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. దోమ మండల పరిధిలోని బొంపల్లి, శివారెడ్డిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన బుధవారం సందర్శించారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తున్న వరి ధాన్యం తేమను సైతం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా జరిగి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వరి ధాన్యం కొనుగోలు సెంటర్ల నిర్వాహకులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు, నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.